# భక్తి

రచన:
శ్రీ వేముల ప్రభాకరుడు.

వారాలకు వారాలే ఆదివారాల మయమయితే యెలా గోయ్' అన్నాడు రాజు.

ఇది హైద్రాబాదు కాబట్టి సరిపోయింది లేకపోతే మన పరిస్థితి నెహ్రూ పార్కులో జంతువులాగుండేది అన్నాను నేను.

'ఈ నగరంలో సరిపోయిందేమీ లేదు. అరగంట రోడ్ల వెంట తిరిగామా ఇహ మన పని అయినట్లే, యే డాక్టరుదగ్గరికి వెళ్దామా? మనం యన్.జి.ఓ.లం. అందులోను స్ట్రైకు చేస్తున్నవాళ్ళం. కాబట్టి స్ట్రైకు పూర్తయి జేబులు గలగల లాడేదాకా కాస్త జాగ్రత్తగా మెలగాలి' 'మరి ఈ రోజు యెలా గడుపుదామంటావ్'

'యాదగిరికి వెళ్ళి దేవుని దర్శనము చేసుకుని సమ్మె విజయవంతంగా ముగిసేట్టు చూడమని ప్రార్థిద్దాం పదా'

'ఆ ప్రార్థన ఇక్కడుండికూడా చేసుకోవచ్చు గదా! అయినా మనకు టైము గడవాలికదా' అన్నాను.

నాలుగంటల్లో సికిందరాబాదు స్టేషను చేరుకుని రైలెక్కితే 40 నిమిషాల్లో యాదగిరి. అక్కడి నుండి టాంగాలో వెళ్ళాలి. టాక్సీకి పెట్టినంత డబ్బుపెట్టి గుట్టకు చేరుకునేసరికి తల ప్రాణం తోకకు వచ్చింది.

ఖాళీ కడుపుతో వెళ్ళే గుట్టెక్కడం కష్టమైనా దేవుని ప్రసాదం ముట్టుకోందే యేదీకూడదని బయలు దేరదీశాడు రాజు. మధ్యలో కొబ్బరికాయల వారి పోరు. నాలుగు కోర్లరుస్తున్నాయి. ఒకటి 80 పైసలంటే, రెండోది 70 అంది. మీకన్నా నేనేం తక్కువ తిన్నానా అని మూడోది 50 అంది. నాలుగోదానికి నోరు పెకల్లేదు. 'సూపరు బజారు వీరిముందు తీసికట్టే' అని నేనంటే 'సుల్తాను బజారు వ్యాపారస్తుల్లా మొదట చెట్టు కొమ్మల్లో నుంచిన ధరను వద్దని వెళ్తుంటే మొదటికి తెచ్చినట్టు తెస్తారు వీరు' అన్నాడు రాజు.

కాని వేపారస్తుడు మాకు మొదట చూపించిన కొబ్బరికాయొకటి చివరికి ఇచ్చిందొకటి.

'ఇదేంటయ్యా' అని యేమంటే 'అయ్యా మీరు పెట్టిందెంత? యాభయి పైసలు. దానికే నా తలకాయంత కాయిస్తే రేశు లాభంకోసం తలబద్దలు కొట్టుకోవాల్సుంటుంది' అన్నాడు.

'ఆయనతో పోరు పెట్టుకుంటే మన తలకాయ పాడవుతుంది, పదవోయ్' అన్నాను రాజుతో.

'నాలుగేళ్ళవాడి తలకాయంతైనా లేనీ కాయను నరసింహస్వామంతవానికి యెలాకొడదామోయ్' అంటూ డాయన!

'మనసులో భక్తుండాలికాని కొట్టే కొబ్బరికాయలో యేముంది'

'ఉన్న భక్తిని ప్రదర్శించుకోందే యెవరికి మాత్రం యెలా తెలుస్తుందని' ఆయనో వాదానికి దారితీశాడు.

ఒకరికి తెలిసేదేముంది బయటివారు చూడాలనీ మనం భక్తిని ప్రదర్శించడం లేదుగా? అయినా మనసులోని మాటను తెలుసుకోలేని వాడు భగవంతుడెలాగౌతాడు' అని నేను ముందుకు నడిచాను.

ఆయన నన్ననుసరిస్తూనే యేదో మాట్లాడబోతున్నాడు. ఆయన నా వాదంలోనుండి మళ్ళించాలని 'కాళ్ళు పీక్కుపోతున్నాయోయ్' అన్నాను.

'గోవిందా...గోవిందా అంటూ నడవ' మన్నాడు.

నా ప్రక్కన నడుస్తున్న యాత్రికులు కొందరప్పటికే ఆ మాట నేశారు. నేను అనకున్నా ప్రక్కవారన్నందుకు ఆయన సంతృప్తి పడ్డట్టున్నాడు, నా మౌనం చూసి మాట్లాడించక గోవిందనామస్మరణం చేస్తూనే నడిచాడు.

పైకి చేరుకుని కొద్దిగా నడిస్తే కోలను కనుపించింది. స్త్రీలు పిల్లలు, పురుషులు అంతా స్నానం చేస్తున్నారు. మేము దాని ముందరే కూర్చుండి ఉన్నాము. రాజు నా ప్రక్కనుండి లేచి ఓ గుంపు పడచులు జలకాలాడుతున్న వైపుగా వెళ్ళి కూర్చున్నాడు. అర్థనగ్నావస్థలో కేరింతలు కొడుతూ ఆడుకుంటున్న ఆ స్త్రీలను చూసి సంతోషం పట్టలేక మెల్లగా ఈలవేసి పిలిచాడు. నేను అయిష్టంగా తలూపాను. ఆయన పర్వాలేదన్నట్లు చూసి చీరలు దొంగిలించి చెట్టుపై కూర్చున్న గోపాలకృష్ణునిలా గట్టుపై కూర్చుండి ఆ స్త్రీలవైపు ఫోజు పెట్టాడు.

వారిదేం గమనించడం లేదు. తరచుగా లభించే స్వేచ్ఛను సంపూర్ణంగా వినియోగించుకుంటున్నారు, కొందరు దాగుడు మూతలాడుచుంటే కొందరు నీళ్ళు చిమ్ముకుంటున్నారు. ఆ కొందరినీ యీ కొందరినీ చూసి సంతోషం పట్టలేక గావుకేకలు పెడుతున్నారు మరి కొందరు. వాళ్ళల్లరిని భరించలేక నా వైపుకు వచ్చిన ఓ నడివయసాయన! నలుగురు పురుషులు ఓ గదిలో సమావేశమైతే చేసే అల్లరికి కిటికీ లెగిరిపోతాయేమో గాని నలుగురు స్త్రీలు సమావేశమైనప్పుడు మాత్రం అమాంతంగా కప్పే ఎగిరిపోతుందన్నాడు.

ఇద్దరము నవ్వుకున్నాము. నేను రాజు వైపుకు తిరిగి చూశాను. ఆయన ప్రథమావస్థలోనే ఉన్నాడు. దేవునికి మంచి కొబ్బరికాయ కొనాలని గట్టెక్కుచూ గోవింద నామస్మరణం చేయాలని వాదించిన భక్తుడేనా ఈ పచ్చి శృంగారనిపించింది.

కొలనులోకి దిగాక అదేమాటడిగాను.

మనకు అందమైన వస్తువు కనిపించింది, చూశాము. అందులో తప్పేముంది అయినా అందంను భగవంతుడెందుకు సృష్టించాడంటావ్? 'అందరినీ ఒకే తీరుపుట్టిస్తే ప్రపంచములో ప్రథమ సోషలిస్టు భగవంతుడే అయ్యేవాడుగా' అన్నాడు.

ఇద్దరమూ నవ్వుకున్నాము.

'భగవంతుని పేరు చెప్పుకుని వచ్చి ఆ స్త్రీలు తమ సౌంధర్యాన్ని ప్రదర్శించడమూ, నీలాటి పరమ ఆస్తికులలో భగవంతుని సన్నిధిలోనే మనసు పాడుచేసుకోడం మంచిదేనా' అన్నాను మళ్ళీ.

'భగవంతుడు దగ్గరగా ఉన్నప్పుడే యేపాపంచేసినా తొందరగా చూసి క్షమిస్తాడోయ్' అని గలగలా నవ్వుతూ కొలనులో మునకలు వేయసాగాడు.

'ఈ కొలను నీళ్లు మూసీ నదిలో ప్రవహించే మురికి నీళ్ళలాగున్నాయి' అన్నాను.

రాజు నన్ను నేరస్తుడిలా చూస్తూ 'అపరాధం... అపరాధం......యెంత మాటన్నావు లెంపలేసుకో' మన్నాడు గట్టిగా.

నేనింకా ఆలస్యం చేస్తే ఆయనే వచ్చి వేసేలాగున్నాడని గబుక్కున ఓ మునక వేసి బయటికి వచ్చాను. కొద్దిసేపటికి ఆయనా వచ్చాడు.

ఇద్దరము గుళ్ళోకి వెళ్ళి వరుసలో నిలుచున్నాము. ఆయన అటూ ఇటూ చూసి 'తొందరగా దర్శనం చేసుకుందాం ఇటురా' అని ప్రక్క వరుసలోకి దూరాడు. ఆయన ముందున్న ఇద్దరు స్త్రీలు కొంత ఇబ్బందిగా ముఖం పెట్టారు. ఈయనదేం గమనించకుండా వారితో సంభాషణ తగిలించి బలవంతంగా మాట్లాడిస్తున్నాడు. నేను మాత్రం ఉన్నచోటే ఉండిపోయాను. దేవుని దర్శనం అయింది అక్కడ పెట్టిన హుండీలాంటి డబ్బిలో పావలా వెయ్యబోతే ఎదురు తిరిగింది.

'అలాకాదండీ ఇలా నేరుగా పడేయాలి' అని వేశాడు. కాని ఓ ఆశ్చర్యకరమయిన విషయ మేమిటంటే ఆ డబ్బిలో పడ్డది మూడు పైసల బిళ్ళేనట. ఇహనా పావలా ఎటుపోయిందో మీకు చెప్పాలా? ఈ విషయం నాకు అక్కడే తెలిస్తే బాగుండేది ఆలయావరణలోకి వచ్చాక నా వెనువెంటనే దర్శనం చేసుకొని వచ్చిన తను చెప్పాడు. ముందేవచ్చి అక్కడే కూర్చొండి కొబ్బరి తింటున్న రాజు ఈ విషయం విని_

'మనం దేవుని పేరిట వేస్తాం, తన కష్టమున్న వారికి దేవు డిచ్చుకుంటాడు, మధ్యలో మన మెందుకు బెంగ పడాలి' అన్నాడు. నేనేమి అనకుండా ఆయన ప్రక్కనే కూర్చొండి కొబ్బరి తినసాగాను. ఓ బిచ్చకత్తె వచ్చి 'బాబూ' అని చెయి చాచింది.

'ఛీ-ఛీ...ఇక్కడకూడా మీరే దర్శనమిస్తేయెలాగా వెళ్లువెళ్లు' అన్నాడు.

నేనో ముక్క పడేసాక దీవిస్తూ వెళ్ళిపోయింది.

'దేవుని ప్రసాదం పిసరుకూడా పోనీయ వద్దంటారు. కాని నీవేం చేశావో తెలుసా?' అన్నాడు.

'ప్రసాద మెంతతింటే అంచాస్తుందా యేంటి పుణ్యము-అయినా పరిగడుపున యీ ముక్కలన్నీ తినడం నాకు మాత్రం చేతగా' దన్నాను.

'పర్వాలేదు మనకు స్నేహితులున్నారుగా వారికి తీసుకుపోయిద్దాం పద...పదా' అని వేగిరపెట్టాడు.

ఆయన తొందరను చూసి 'యెక్కడికి...ఇప్పుడే వెళ్దామా యేం' అన్నాను.

'హోటల్ కోయ్ కాఫీ త్రాగడానికి పదా' అన్నాడు మళ్ళీ. వెళ్ళి కాఫీ త్రాగి ఓమారు గుట్టంతా కలియ చూడ్డానికని బయలుదేరాం. నిజానికి గుట్టపై ప్రాచీనశిల్ప కళా వైభవం యేమాత్రమూ లేదనే చెప్పాలి యెక్కడా ఆ చాయలే మనకు కన్పించవు. ప్రభుత్వ భవనాలూ, సేట్లూ కంట్రాక్టర్లు కట్టించిన సత్రాలు మాత్రం బోలెడున్నాయి.

ఓ హైద్రాబాదు కంట్రాక్టరు కట్టించిన ధర్మ సత్రాన్ని చూపించి 'నిజంగా ఇంతమంచి సత్రాన్ని కట్టించి ఈయనెంత పుణ్యం కట్టుకున్నాడో?' అన్నాడు రాజు.

'నీటి మూటలాంటి పుణ్యం ఇంటిదాకా ఉండం టావా?'

'యేం? నీటి మూటలాంటి దంటున్నా వేం?' రెట్టించాడు.

'మరికాకుంటే ప్రజాధనం దోచితెచ్చి ధర్మసత్రాలు కడితే పుణ్యంవస్తుందా? అరతట్ట సిమెంటుకు 6 తట్టల ఇసుకపోసి కట్టించగా మిగిలిన యే బ్రిడ్జి డబ్బుతోనో గదా ఇది కట్టించింది. రేపు ఆ బ్రిడ్జి కూలితే యెందరి అమాయకుల ప్రాణాలు పోతాయో నీకు తెలుసా? ఆ వుసురంతా యెటుపోతుంది. ఓ కొండంతా ముందు కొచ్చి కూర్చుంటే ఈయనగారి కొమ్ముల గొర్రెలాంటి పుణ్యం యెంతసేపు ఢీకొంటుంది' అన్నాను.

ఆయన చాలాసేపు మౌనంగా ఉన్నాడు. నామాటల గురించి ఆలోచిస్తున్నాడేమో ననుకున్నాను.

కాని అప్పుడే యేదో జ్ఞప్తికొచ్చినవాడిలా వెనుకకు మరలి 'మనం మిగిలిన కొబ్బరి ముక్కలు హోటల్లోనే మరిచి వచ్చామోయ్' అని నామాట [illegible] పరుగు దీశాడు. నేనక్కడే నిలబడి పోయాను.

కొద్ది సేపటికి విచార వదనంతో వచ్చి ఎంతో భాద పడిపోతూ 'దొరకలేదు' అన్నాడు.

'పోతేపోయింది విచారమెందుకూ ఇంకా బోలెడు కొనుక్కోవచ్చుగా' అన్నాను.

ఆయనకు కోపం వచ్చినట్టుంది.

'నేనా కొబ్బరికి మూల్యం కట్టి భాదపడడం లేదోయ్ ఆ ముక్కపోయిందీ అంటే మనం భగవంతుని యెడలి యేదో అపరాధం చేశామన్న మాటే' ఆ అపరాధం యేమై ఉంటుందా అని ఆలోచిస్తున్నట్టు కొద్దిసేపు తల గోక్కొని' ఆ...జ్ఞప్తికొచ్చింది. సాక్షాత్తు భగవంతుని కోలను నీటినే మూసీనది మురికి నీటితో పోల్చావు. పైగా లెంపలు వేసుకోమంటే అవతల కొంపలు మునిగి పోతున్నట్టు బయటికి వెళ్ళావు. జ్ఞప్తుందా? నా ముఖం లోకి గ్రుచ్చి గ్రుచ్చి చూశాడు.

ఆయన మాటలు నన్నే మాత్రం కదిలించ లేక పోయాయి.

'మూసీనది మురికి నీటికీ యీ కోలను నీటికీ ఒక్క మురికిలో తప్ప అసలు పోలిక లేదు.' అన్నాను.

'అంటే?'

'అప్పుడే తొందరపడకు ఆ రెంటికీ ఓ పెద్ద తేడా ఉంది'

పరిశుభ్రమైన శరీరాన్ని, మనసును పాడు చేసుకోడానికి ఈ కోలనూ, దేవాలయ వినియోగపడుతున్నాయే తప్ప శాంతికీ సచ్ఛిందనకు కాదు. యేండ్లుగా పళ్ళి, యెటూ ప్రవహించకుండా నిలిచిన ఈ నీటిలో స్నానం చేస్తున్నాం కారణం? ..నా డెప్పుడో యేరాజో ఈ కోలనులో స్నానంచేసి తన రోగాలను పోగొట్టుకున్నాడని, యేదేవాలయ ప్రసాదం స్వీకరించి పాప పరిహారం చేసుకున్నాడని యే అమ్మమ్మో చెప్పిన కథలను ఇంకా గ్రుడ్డిగా నమ్మడమే! అంటే ఆమడల దూరాన్ని అదిగమించి వచ్చి రోగాలు కొనుక్కుపోతున్నాం.

కోలనులో స్నానం చేసే స్త్రీలను దొంగ చూపులు చూడ్డం దైవ దర్శనం కోసం వెళ్ళి వరుసలో స్త్రీస్పర్శ కోసం పాటుపడ్డం, కనీసం బిచ్చకత్తెకు కొబ్బరిముక్క వేయడానికి కూడా భగవంతుని పేరు చెప్పి నిరాకరించడం లాంటివి భగవంతుని సన్నిధిలో జరుగుచున్నాయి.

ఈ పనులు ఒక్క నీవు చేశావనే నేను చెప్పడం లేదు, వేలాదిమంది నీలాంటి భక్తులు చేస్తున్నదల్లా ఇంతే. అసలు నాటితనం ఈ దేవాలయాల్లో యెక్కడ నిలుచుందనీ-కనీసం పూజార్లుకూడా మోసాలకగబడ్డారంటే నీవు నమ్ముతావే అనుకుంటా.

ఇలాంటి వాతావరణం భగవంతుని పైనే అసహ్యం పుట్టించదా? మురికి నీటిని మురికి నీరంటేనే మన కొబ్బరి ముక్క పోయిందన్నావ్ కాని ఒక్కసారైనా మన అజాగ్రత్తలో వల్లకూడా జరిగియుండవచ్చు ననుకున్నావా? లేదు ..అది దేవుని మహిమని కప్పిపుచ్చావు.

కనీసం ఇప్పటికైనా ఈ కోలనూ, వాతావరణం మనను పాడుచేస్తుందంటే ఒప్పుకుంటావా? అయితే ఆ మూసీనది మురికి నీరుంది చూశావ్ అది పశువులకైనా వినియోగపడతుంది. అది చాలు దాని జన్మ సార్ధకతకు అని-

ఆయన ముఖ కవలికలు గమనించాను. నాకేమీ తోచలేదు. 'పోదాం' అనకుండానే గుట్టదిగుతున్న ఆయన అడుగులో అడుగు వేసుకుంటూ నేను క్రిందికి దిగాను.

---

# ప్రజారంజని

## ప్రధాన సంపాదకులు ; చిత్రభాను

శ్రీకాకుళం జిల్లాలో నేటివరకూ సాహిత్యపరమైన పత్రికంటూ లేనేలేదు. సుప్రసిద్ధులైన సాహితీవేత్తలనేక మంది జన్మించిన ఈ పుణ్యభూమిలో పత్రికలేని కొరత తీర్చుటకు మొట్టమొదటసారిగా అనేక శ్రమదమాదుల కోర్చి దృఢసంకల్పముతో, ఏకైక లక్ష్యంతో ఈ పత్రికను వెలువరించుటకు జిల్లా రచయితలు సాహసించారు. ఈ సాహసానికి యావదాంధ్ర ప్రజానీకపు అండదండలు 'ప్రజారంజని'కి పూలదండలుగా ఉంటాయని రచయితల ఆకాంక్ష! జనవరి 1 వ తేదీకి పత్రిక వెలువడుతుంది. వివరములకు : ప్రజారంజని, నాగూరు. (పార్వతీపురంజిల్లా)

---

'కథాంజలి'లో వెలువడే కథలన్నీ కేవలము కల్పితము. ఎవరినీ ఉద్దేశించి వ్రాసినది కాదు. రచయితల రచనలకు ఏమాత్రమూ మేము బాధ్యులముకాదు. —సంపాదకుడు.

Edited and Published by A.N. Raghavachar, No. 6-B. Murugesamudali Street, Madras-1
Printed by R. Bakthavachalu Bharathamatha Press, No. 39, Anderson St., Madras-1.